క్లుప్తంగా

పుత్తూరులో స్వర్ణలక్ష్మీ పూజ రేపు

పుత్తూరు: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం సాయంత్రం 5 గంటలకు స్వర్ణలక్ష్మీ పూజ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రామదూతస్వామి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ స్వర్ణలక్ష్మీ పూజలో పెద్ద సంఖ్యలో భక్తులు భాగస్వాములు కావాలని కోరారు.

నేడు సీతారాముల కల్యాణం

పుత్తూరు: పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్యలో శ్రీరామ జన్మభూమి భవ్య దివ్య మందిరం ప్రారంభమైన నేపథ్యంలో రథసప్తమిని పురస్కరించుకుని కల్యాణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఆడిటర్ రామకృష్ణ, తిరుపతికి చెందిన సంస్కార్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఈవీఎంలపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

గంగాధర నెల్లూరు: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో డ్వాక్రా సభ్యులకు గురువారం అవగాహన కల్పించారు. వెలుగు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ దేవి ఓటు వేసే పద్ధతిని వివరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సభ్యులు తమ పరిధిలోని గ్రామ ప్రజలకు ఓటు హక్కు ప్రయోజనాలను వివరించాలని తెలిపారు. ఏపీఎం చిరంజీవి, సీసీలు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

వెదురుకుప్పం: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కే పద్మనాభరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం అనే నినాదంతో శుక్రవారం మండలంలోని దిగువ గెరిగదొన నుంచి ర్యాలీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌కేఎం పురం, పచ్చికాపల్లం, పాతగుంట, నల్లవెంగన పల్లె, జక్కి దొన, అగ్గిచేను పల్లె, తిరుమలయ్యపల్లె, పెరుమాళ్లపల్లె మీదుగా వెదురుకుప్పం వరకు యువత భారీ ఎత్తున ర్యాలీ చేస్తున్నట్లు చెప్పారు.

కృష్ణమరాజు కుటుంబానికి డిప్యూటీ సీఎం పరామర్శ

పాలసముద్రం: వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ సుందరరాజు బాబాయి కృష్ణమరాజు కుటుంబ సభ్యులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. కృష్ణమరాజు భార్య జయలక్ష్మి గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం ఆ గ్రామానికి వెళ్లి, జయలక్ష్మి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కృష్ణమరాజు కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తులసీ యాదవ్, వైఎస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, రైతు భరోసా కేంద్రం చైర్మన్ పోలయ్య, నాయకులు చంద్రశేఖర్‌రాజు, షణ్ముగరెడ్డి, గోపాల్, వేణు, కుట్టి తదితర నాయకులు ఉన్నారు.

నారాయణవనంలో రథసప్తమికి ఏర్పాట్లు



సిద్ధం చేసిన వాహనాలు

నారాయణవనం: సూర్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏడు వాహనాలపై ఒక్కరోజు బ్రహ్మోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. వారు గురువారం మీడియాతో మాట్లాడుతూ వేకువ జామున 3 గంటలకు సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా, గంట, నైవేద్య కార్యక్రమాలను పూర్తి చేసి 4 గంటలకు ఏకాంతంగా కల్యాణ వెంకన్న, పద్మావతీ అమ్మవార్లకు శుక్రవార అభిషేకాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 6.30 గంటలకు సూర్యప్రభ వాహనంపై స్వామి వారు గ్రామ వీధుల్లో విహరిస్తారని తెలిపారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తి వరుసగా చిన్నశేష, పల్లకి, కల్పవృక్ష, పెద్దశేష, తిరుచ్చి వాహనాలపై మాడ వీధి ఉత్సవాల్లో భక్తులకు దర్శనమిస్తారని అన్నారు. సాయంత్రం పూజల అనంతరం 6.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి రాత్రి 9 గంటలకు ఏకాంతసేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రథసప్తమి సందర్భంగా వాహనాలను ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు శ్రీధరభట్టాచార్య, భద్రతా జమేదార్ వెంకటరమణ పరిశీలించారు. మామిడి తోరణాలు, అరటి పిలకలను కట్టి ఆలయాన్ని అలంకరించారు.

ఆహ్లాదానికి అందలం





నగరి: పార్కులో మహానేత విగ్రహం ఆవిష్కరణ అనంతరం మంత్రి ఆర్కేరోజా, నింద్ర: ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి: వినోదం..ఆరోగ్యంతో పాటు మెరుగైన జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు పార్కులు దోహదం చేస్తాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం పట్టణంలోని కుశస్థలీ నది గట్టున ఆహ్లాదకరంగా ఆధునిక హంగులతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ తుడా పార్కును ఆమె ప్రారంభించారు. పార్కులో ఏర్పాటు చేసిన మహానేత విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నారుల ఆటల పరికరాలు, వాకింగ్‌కు సిద్ధం చేసిన మెడికేటెడ్ రాళ్ల ట్రాక్, వినూత్నంగా నాటిన మొక్కలు, పచ్చదనం ఉట్టిపడే పచ్చిక మైదానాలను స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె పరిశీలించారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి

మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ 2005లో నగరి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినా ఏ నాయకులు పార్కును ఏర్పాటు చేయలేక పోయారన్నారు. ఉద్యోగ, వృత్తి రీత్యా ఒత్తిళ్లకు గురైన వారు, వయోవృద్ధులు, ఆహ్లాదకరమైన ప్రాంతంలో సేదతీరాలనుకున్నవారు, ఉదయం వాకింగ్ చేయాలనుకునే వారు పార్కు కోసం ఎదురు చూస్తారన్నారు. అందుకే రూ.80 లక్షల నిధులతో డాక్టర్ వైఎస్సార్ తుడా పార్కును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్కులు ఆహ్లాదాన్ని పంచడంతో పాటు పట్టణ ప్రమాణాలను పెంచుతాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పుత్తూరులో రూ.1.10 కోట్ల వ్యయంతో మున్సిపల్ పార్కు ఏర్పాటుచేయడంతో పాటు రూ.24 లక్షల వ్యయంతో చిల్డ్రన్స్ పార్కుకు ప్రహరీగోడ నిర్మిస్తున్నామని తెలిపారు. రూ.39.5 లక్షల వ్యయంతో వడమాలపేటలో తుడా పార్కు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పార్కును నగరి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం రెడ్డి, కమిషనర్ మంజునాథ్ గౌడ్, తుడా డీఈ కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మహిళల స్థాయి పెరిగింది

నింద్ర: మహిళకు ఆత్మస్థైర్యాన్నిచ్చిన నేత సీఎం జగనన్న అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. మండలంలో 640 సంఘాల్లోని 5,829 మందికి రూ. 22 కోట్ల 9లక్షల 91 వేల మెగా చెక్కును ఆమె అందజేశారు. మహిళలతో కలిసి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంఘాలు దీనస్థితి నుంచి నేడు పటిష్టంగా మారాయని తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన మహిళలే వైనాట్ 175 అన్న జగనన్న మాటలకు సాక్ష్యమన్నారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, దుర్గాదేవి, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీఓ భవాని, వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్యదర్శి శ్యామ్‌లాల్, మండల కన్వీనర్ వేణురాజు, జిల్లా కార్యదర్శి మేరి, కోఆప్షన్ సభ్యుడు అనిల్, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, సర్పంచ్‌లు బాబురెడ్డి, గౌరి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు దామోదరం, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, ఏపీఎం చంద్రకళ, వెలుగు సభ్యులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

నింద్ర: ప్రతి పేదవాడికీ సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా సీఎం జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి రోజా అన్నారు. గురువారం మండల కేంద్రంలో రెండో విడత ఇంటి పట్టాల కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. 150 మందికి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇల్లు లేని వారు ఉండకూడదనేది తమ ధ్యేయమని తెలిపారు. మండల కేంద్రంలో రెండో విడతగా 150 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. గతంలో ప్రభుత్వ స్థలం ప్రవేటు వారికి ఇచ్చి, వారి స్థలాన్ని ప్రభుత్వం తీసుకుని పేదలకు పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు.

మహిళా పక్షపాతి సీఎం జగనన్న



వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

- మరోసారి సీఎంగా జగనన్నను ఆశీర్వదించండి
- వైఎస్సార్ సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి
- వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ

పుత్తూరు: మహిళా పక్షపాతి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా ప్రతి మహిళా ఆశీర్వదించాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వడమాలపేట ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆసరా 4వ విడత రూ.7.06 కోట్ల మెగా చెక్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న 'చెప్పింది చేస్తారని- చేయగలిగిందే చెబుతారని' అన్నారు. పాదయాత్రలో మహిళా సంఘ సభ్యులను రుణాల నుంచి విముక్తి చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 7.97 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని 78.76 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు 4వ విడతల్లో రూ.25,570 కోట్లు పంపిణీ చేశారని వివరించారు. ఇది సీఎం జగనన్న పనితీరుకు, మడమ తిప్పని నైజానికి నిదర్శనమన్నారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మాట తప్పారని గుర్తు చేశారు. జగనన్న ప్రతి సంక్షేమ పథకంలో మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఆయన మరో 30 ఏళ్లు ఆయన సీఎంగా పనిచేయాలని ఆకాంక్షించారు. నగరిలో ఈసారి వైఎస్సార్ సీపీకి భారీ మెజారిటీ వచ్చేలా ఆశీర్వదించాలని కోరారు. ఎంపీడీఓ సుజాత, తహసీల్దార్ రాజసింహానరేంద్ర, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు లోకేష్, ఉపేంద్ర, వైఎస్సార్ సీపీ వడమాలపేట మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు సురేష్‌రాజు, మునిశేఖర్, రామిరెడ్డి, శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, సోషల్‌మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి, డీఎల్‌ఎస్‌సీ మెంబర్ కిరణ్‌కుమార్, వడమాలపేట సర్పంచ్ మునెమ్మ, మంజుల, కుసుమ, అంజమ్మ, కమల, శేఖర్, సుధీర్ రెడ్డి, నందయ్య, మదన్‌మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఏపీఎం మునికృష్ణయ్య, పెద్ద సంఖ్యలో మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ కుమార్

- ఈసీఈ, సీహెచ్ఈ గ్రూపులకు అనుమతి

పుత్తూరు: పట్టణంలోని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డు అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వీ.కుమార్ తెలిపారు. గురువారం కళాశాలలో అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌బీఏ గుర్తింపు రావడం కళాశాల పనితీరుకు నిదర్శనమన్నారు. ఎన్‌బీఏ ద్వారా కళాశాలకు అదనపు నిధులు మంజూరవుతాయని వెల్లడించారు. ఈ నిధులతో ల్యాబ్‌లు, వర్క్‌షాప్, క్రీడారంగ అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు.అలాగే ఈసీఈ, సీహెచ్ఈ గ్రూపులకు అనుమతులు లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ కిషోర్, టీపీఓ జయచంద్ర, ఏఓ హనుమంతరావు, సూపరింటెండెంట్ ఆనందరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ వేణుగోపాల్‌రెడ్డి

పుత్తూరు: ఏ పంటలకైనా సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చని ఆకాశవాణి తిరుపతి కేంద్రం కిసాన్ వాణి చీఫ్ కోఆర్డినేటర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం వడమాలపేటలో కిసాన్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏటా ఫిబ్రవరి 15న ఆకాశవాణి కిసాన్ దివస్ కార్యక్రమం ద్వారా రైతులకు శిక్షణ ఇస్తోందని తెలిపారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం తిరుపతి హార్టికల్చర్ శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి పంటను ఆశిస్తున్న తేనె మంచు పురుగు నివారణకు బుప్రోఫోజిన్, అసిఫేట్ 2 గ్రాములు, హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏరువాక కేంద్రం చిత్తూరు కోఆర్డినేటర్ డాక్టర్ రెడ్డిరాము యాజమాన్య పద్ధతులను వివరించారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణారెడ్డి వరి, వేరుశనగ, నువ్వులు సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వడమాలపేట వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, ఆకాశవాణి సాంకేతిక సిబ్బంది బాలసుబ్రమణ్యం, దండపాణి, ఆర్‌బీకే ఇన్‌చార్జిలు, రైతులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయండి

కార్వేటినగరం: మండల కేంద్రంలో నిర్వహించే ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీపీ లత కోరారు. గురువారం ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉప ముఖ్యమంత్రి విచ్చేస్తున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు చేతి పంపుల మెకానిక్‌లకు ఇంటర్వ్యూలు

పాలసముద్రం: మండలంలో పాడైపోయిన చేతి పంపుల మరమ్మతులకు నైపుణ్యం కలిగిన నిపుణుల నియామకానికి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో చేతి పంపులు పాడైపోయాయని, వాటిని మరమ్మతు చేసి, వాడుకలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు నేరుగా ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు.

పశువైద్యాధికారి నిర్లక్ష్యంతో లేగదూడ మృతి



మృతి చెందిన లేగదూడ

పాలసముద్రం: పశువైద్యాధికారి నిర్లక్ష్యంతో లేగదూడ మృతి చెందిన సంఘటన వనదుర్గాపురంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జయరామశెట్టి పాడి ఆవును పోషిస్తున్నాడు. ఆదివారం ఆవు ఈనింది. ఆ లేగదూడకు అనారోగ్యం వచ్చింది. ఈ విషయం గుర్తించిన పాడిరైతు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి, లేగదూడకు వైద్యం చేయాలని వైద్యాధికారి యశస్విని కోరాడు. ఆమె పట్టించుకోలేదని, గోపాలమిత్ర వచ్చి వైద్యం చేశాడని, అయినా దూడ మరణించిందని బాధితుడు ఆరోపించాడు. దూడ మృతికి పశువైద్యాధికారులే కారణమని విమర్శించాడు. ఈ విషయమై పశువైద్యాధికారిని వివరణ కోరగా తాను ఉన్నతాధికారుల సమీక్ష సమావేశానికి వెళ్లాల్సి ఉన్నందున, గోపాలమిత్రను పంపి, వైద్యం చేయాలని సూచించానని చెప్పారు.

క్షత్రియ భవన నిర్మాణానికి భూమిపూజ

రేణిగుంట: రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలో గురువారం రూ.10కోట్ల అంచనాతో క్షత్రియ భవన నిర్మాణానికి రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం నాయకుడు గోకరాజు గంగరాజు భూమి పూజ చేశారు. అనంతరం ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడుతూ తిరుపతి పుణ్యక్షేత్రంలో రాష్ట్రస్థాయి క్షత్రియ సంక్షేమ భవనం అవసరమని భావించి స్థలాన్ని కొనుగోలు చేసి రూ.10కోట్ల వ్యయంతో నిర్మించాలని నిర్ణయించడం సంతోషకరంగా ఉందని అన్నారు. క్షత్రియ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకటశ్రీనివాసరాజు, నాయకులు డాక్టర్ బలరామరాజు, నారాయణ రాజు, మనోహర్‌రాజు, గిరిరాజు, అశోక్‌రాజు, శ్యామరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట పెన్నిధి వైఎస్సార్



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి



విగ్రహ నిర్మాణకర్త హరిబాబుకు సత్కారం

గంగాధరనెల్లూరు: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల జీవితాల్లో వెలుగులు నింపి, వారి పాలిట పెన్నిధి అయ్యారని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి కొనియాడారు. గంగాధర నెల్లూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వైస్ ఎంపీపీ హరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంకు స్థానికులు అపూర్వ స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాల నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ హరిబాబు, మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డితో కలిసి దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ రైతుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఉచిత విద్యుత్, జలయజ్ఞం, రుణమాఫీ చేసిన ఏకైక సీఎం డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అన్నారు. అలాగే బడుగు, బలహీనవర్గాలకు కుటుంబ పెద్దగా, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించి, వారి ఉన్నత చదువులకు బాటలు వేసి మహనీయుడుగా నిలిచారని కొనియాడారు. పేదలకు ఆరోగ్యశ్రీ 108 అందించి అండగా నిలిచారని చెప్పారు. రాజన్న వారసుడు, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన తండ్రి బాటలోనే పయనిస్తున్నారని తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. అనంతరం రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఢిల్లీకుమార్, యువజన విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శి జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్డుకు మోక్షం



రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మండల వైఎస్సార్ సీపీ నేతలు

గంగాధరనెల్లూరు: బలిజపల్లె- గంగాధరనెల్లూరు గతుకుల రోడ్డుకు మోక్షం లభించిందని వైఎస్సార్ సీపీ నాయకుడు గుణశేఖర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అక్కనగారిపల్లె గ్రామం వద్ద రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి జీడీ నెల్లూరు, కలిజవేడు, నందనూరు చుట్టుపక్కల గ్రామాల పర్యటన సందర్భంగా ప్రజలు రోడ్డు మరమ్మతు చేయాలని విన్నవించారన్నారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి 7.6 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులకు రూ.4.01 కోట్లు మంజూరు చేయించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ రూపకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఏకాంబరం, నాయకులు కలిజవేడు సుబ్రహ్మణ్యం రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డి, రుక్మానంద రెడ్డి పాల్గొన్నారు.


9న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: పట్టణంలోని సబ్‌కోర్టు ఆవరణలో మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర సూచించారు. గురువారం కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ అత్యధిక కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. ప్రధానంగా రాజీకి లోబడిన క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేయాలని సూచించారు. డబ్బుతోపాటు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీయే రాజమార్గమని కక్షిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. తద్వారా పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేద్దాం



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెనుమూరు (కార్వేటినగరం): రాప్తాడులో ఆదివారం నిర్వహించనున్న సిద్ధం కార్యక్రమానికి సంఘీభావంగా శనివారం పెనుమూరులో నిర్వహించబోయే బైక్‌ర్యాలీని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజయకుమార్ రెడ్డి గురువారం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటలకు పెనుమూరు క్రాస్ నుంచి చిప్పారపల్లె వరకు నిర్వహించ తలపెట్టిన భారీ బైక్ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కే సురేష్‌రెడ్డి, కోశాధికారి మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, జేసీఎస్ మండల కన్వీనర్ హరికృష్ణ, యువజన విభాగం మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాబు రెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీపతి, ఉమాపతి, కొల్లు మోహన్ పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

నగరి: గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, మండలంలో పల్లెల అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయిని ఎంపీపీ భార్గవి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వెలుగు సమావేశ మందిరంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత ఎంపీడీవో జి.రవికుమార్‌రెడ్డి సూచనల మేరకు మండలంలోని వివిధశాఖల అధికారులు తమ విభాగంలో చేపడుతున్న అభివృద్ధి పనులను సభ్యులకు వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మంత్రి ఆర్కేరోజా సహకారంతో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో జరుగుతున్నాయన్నారు. ప్రజలకు పాలనను చేరువచేస్తూ సచివాలయాలు, ఆర్బీకే సెంటర్లు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మిస్తున్నారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను ఆధునికీకరించడంతో పాటు జగనన్న ఆరోగ్యసురక్ష, ఫ్యామిలీ డాక్టర్ పేరిట గ్రామీణ ప్రజలకు ఉన్నత వైద్యం అందుతోందన్నారు. గ్రామీణ పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి మారాయని తెలిపారు. ట్యాబ్‌లు, క్రీడాపరికరాలు విద్యార్థులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రూ. 150 లక్షల వ్యయంతో కీళపట్టు నుంచి తమిళనాడు సరిహద్దు వరకు పలు గ్రామాలను కలుపుతూ తారురోడ్డు, నాగలాపురం రోడ్డు నుంచి ఇరుగువాయికి రూ.1.08 కోట్ల వ్యయంతో రోడ్డు వేసి దశాబ్దాల ప్రజల కల నెరవేర్చినట్లు తెలిపారు. పలువురికి పట్టాలు ఇచ్చి ఇల్లు కట్టివ్వడంతో పాటు రిజిస్ట్రేషన్ కూడా చేసి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఇలా ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. ఈ సందర్భంగా ముడిపల్లి సర్పంచ్ తమ పంచాయతీ దళితవాడలో శ్మశానికి వెళ్లే మార్గంలో కల్వర్టు ఛిద్రమైందని, సబ్‌సెంటర్‌లో పనులు అసంపూర్తిగా ఉన్నాయని మండల నిధులు కేటాయించాలని కోరారు. ఎంపీపీ సమాధానమిస్తూ ఎస్టిమేట్లు సిద్ధం చేసుకుంటే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. వైస్ ఎంపీపీ కన్నియప్ప, మండల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.